క్లుప్తంగా

కుట్టుమిషన్లు పంపిణీ



జడ్చర్ల టౌన్: మన సేవా సమితికి స్థానిక 24వ వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి గురువారం 10 కుట్టుమిషన్లు అందజేశారు. సేవా సమితి ద్వారా ఇప్పటికే కొంత మంది మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ ఇచ్చారు. దీంతో స్పందించిన కౌన్సిలర్ మహిళల ఆర్థిక స్వావలంభనకు చేస్తున్న కృషికి తనవంతు సహకారంగా మిషన్లు అందజేశారు. 24వ వార్డులో ఉన్న మహిళలకు శిక్షణ ఇప్పించాలని సూచించారు. శిక్షణ పొందిన వారిలో నిరుపేదలుంటే వారికి కుట్టుమిషన్లు అందిస్తానని కౌన్సిలర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మన సేవా సమితి అధ్యక్షుడు వేణు, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రచారి పాల్గొన్నారు.

బోరుమోటారు ఏర్పాటు

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్లలో గుట్టపై వెలసిన చౌడేశ్వరీ ఆలయంలో గురువారం నూతనంగా బోరుమోటారు వేయించినట్లు హనుమన్ ఆలయ అర్చకుడు ప్రణేష్‌శర్మ తెలిపారు. ఆలయం ఆవరణలో పూరాతన శివాలయం ఉందని, అందుకు ఆలయాల అభివృద్ధి పనులకు, పూజలకు తనతల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.50వేలు ఖర్చు చేసి బోరు వేయించినట్లు తెలిపారు. దాతను సర్పంచ్ జయమ్మ, ఉపసర్పంచ్ రఘు, లక్ష్మయ్య, శేఖర్ రెడ్డి, రంజిత్, నారాయణ, హన్మంతు తదితరులు అభినందించారు.

అందుబాటులో ఆయుర్వేద వైద్యం

దేవరకద్ర: మండల కేంద్రంలో ఆయుర్వేద వైద్యం అందుబాటులోకి వచ్చింది. కొన్ని రోజులుగా వైద్యులు లేక సేవలు అందని పరిస్థితి ఉండగా, ప్రస్తుతం డిప్యూటేషన్‌పై ఆయుర్వేద వైద్యుడిని నియమించారు. కోయిల్‌సాగర్ ఆయుర్వేద వైద్యశాలలో పనిచేసే డాక్టర్ ఎల్లప్పను దేవరకద్రకు కేటాయించారు. గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు ఆయన ఇక్కడి పీహెచ్‌సీలో అందుబాటులో ఉంటారు. సోమవారం నుంచి బుధవారం వరకు కోయిల్‌సాగర్ ఆయుర్వేద వైద్య శాలలో ఉంటారు. ఆయుర్వేద మందులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ ఎల్లప్ప తెలిపారు.

డీలర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

గండేడ్: డీలర్ల సంఘం మండల నూతన కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షురాలిగా ప్రవీణ, అధ్యక్షుడిగా గోపాల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పి.జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గోపాల్‌గౌడ్ మాట్లాడుతూ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కంటివెలుగు శిబిరం

జడ్చర్ల: మండలంలోని చర్లపల్లిలో గురువారం కంటి వెలుగు వైద్య శిబిరాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య ప్రారంభించారు. అనంతరం బూర్గుపల్లిలో మన ఊరు–మన బడి పథకం కింద పాఠశాల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అదేవిధంగా రూ.5లక్షలతో చేపట్టే చర్లపల్లి–గంగాపూర్ రోడ్డుకు సంబంధించిన గ్రావెల్ పనులను ప్రారంభించారు.

నేడు పశువైద్య శిబిరం

మహమ్మదాబాద్: మండలంలోని చిన్నయ్యపల్లిలో పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి రాంప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశువులకు చూడీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కల్తీ విక్రయంపై కేసు నమోదు

రాజాపూర్: కిరాణ దుకాణంలో కల్తీ చాయపత్తి విక్రయిస్తున్నారనే సమాచారంతో గురువారం తనిఖీలు నిర్వహించినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బాలస్వామి కిరాణ దుకాణంలో రూ.2వేల విలువ చేసే కల్తీ చాయపత్తిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. కల్తీ వస్తువులు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తి రిమాండ్

నవాబుపేట: పెళ్లి చేసుకుంటానని ఓ యువతికి మాయమాటలు చెప్పి శారీరకంగా ఉపయోగించుకుని తీరా పెళ్లి మాట ఎత్తగానే మొహం చాటేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. ఇందుకు సంబంధించిన ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చాకలపల్లికి చెందిన గొడుగు సత్యనారాయణ సమీప గ్రామానికి చెందిన గిరిజన యువతిని ఉద్యోగం ఇప్పిస్తానని పరిచమయ్యాడు. మాయమాటలు చెప్పి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని శారీరకంగా లొంగదీసుకొని నమ్మించి బంగారం, నగదును తీసుకున్నట్లు తెలిపారు. తీరా పెళ్లి గురించి అడగగా, సమాధానం చెప్పకుండా దాటవేస్తూ మోసం చేస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం డీఎస్పీ మహేష్ ఆదేశాల మేరకు గొడుగు సత్యనారాయణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తిమ్మసానిపల్లిలో సమస్యలు తిష్ట

- రైళ్ల రాకపోకలతో ట్రాఫిక్ అంతరాయం
- బస్వోనికుంటలోకి మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

వార్డు నంబర్	1
జనాభా	5,384



బస్వోనికుంటలో చేరిన మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 1వ వార్డులో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. విలీన గ్రామమైన తిమ్మసానిపల్లిలో మురుగుకాల్వలు, సీసీరోడ్లు నిర్మించాల్సి ఉంది. రైల్వేగేటు వద్ద పైపు లీకేజీ కారణంగా రోడ్డుపైకి తాగునీరు వచ్చి వృథా అవుతోంది. గేటు నుంచి అర కిలోమీటరు వరకు సింగిల్ రోడ్డే కావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. గేటు పడినప్పుడు రైలు వెళ్లే వరకు అటు, ఇటు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇక్కడ అండర్ పాస్ లేదా రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. పిల్లలమర్రికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కనే బస్వోనికుంట ఉంది. ఇందులోకి ఓపెన్ నాలాల నుంచి మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోందని వాపోతున్నారు. వార్డు పరిధిలోని వెంకటేశ్వరకాలనీ, లక్ష్మీనగర్‌కాలనీల్లో వర్షాకాలంలో నీరంతా ఏరులై పారుతుంది. ఇక మౌలాలీగుట్ట ప్రాంతంలో వర్షాకాలంలో చిక్కుడువాగు పొంగి పొర్లుతుంది. ఏడాది కిందట విద్యుత్ స్తంభాలు పాతినా ఇప్పటికీ వీధి బల్బులు ఏర్పాటు చేయలేదు. దీంతో అంతా చీకటిగా ఉంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



లక్ష్మీనగర్‌కాలనీలో పారుతున్న మురుగు

ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది..



ఇటీవలే డబుల్ లైన్ రైల్వే ట్రాక్ నిర్మించారు. దీంతో రైళ్లు వచ్చినప్పుడు గేటు వేయడంతో రోడ్డుకు ఇవతల, అవతల కిలోమీటరు వరకు ట్రాఫిక్ నిలిచిపోతుంది. అండర్ పాస్ లేదా ఆర్‌ఓబీ వేస్తే బాగుంటుంది. బీసీ కాలనీలో సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మించాలి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి. – తిరుపతయ్య, తిమ్మసానిపల్లి

రక్షణ గోడ నిర్మించాలి..



రైల్వే బ్రిడ్జి కింది నుంచే పట్టణంలోకి వెళ్లాలి. వర్షాకాలంలో చిక్కుడువాగు నుంచి వరద నీరు ప్రవహిస్తుంటుంది. కనీసం రెండు ఖానాల్లోనైనా లోతు పెంచి పక్కన రక్షణ గోడ కట్టాలి. రాకపోకలకు సౌకర్యం ఉంటుంది. కమ్యూనిటీ హాలు, గుడి నిర్మిస్తే బాగుంటుంది. – బాలు, మౌలాలిగుట్ట

అభివృద్ధి పనులు చేపడుతున్నాం..



మూడేళ్లుగా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం. లక్ష్మీనగర్, వెంకటేశ్వరకాలనీల్లోని నాలుగు వీధుల్లో రూ.20లక్షలతో సీసీరోడ్లు వేశాం. అలాగే రూ.5లక్షలతో రెండు హైమాస్ట్ లైట్లు బిగించాం. వార్డు పరిధిలో రూ.5లక్షలతో రోడ్ల మరమ్మతు చేపట్టాం. మౌలాలిగుట్ట ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశాం. వర్షాకాలంలో ఎదుర్కొనే ఇబ్బందులను పరిష్కరిస్తాం. రైల్వే బ్రిడ్జి వద్ద తగిన ఏర్పాట్లు చేస్తాం. – జి.రోజా, కౌన్సిలర్

సీఎల్‌ఆర్ స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి

జడ్చర్ల టౌన్: స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జన్మదినం పురస్కరించుకుని 12వ వార్డు కౌన్సిలర్ బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి స్పోర్ట్స్‌మీట్‌ను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే క్రీడల్లో క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. క్రికెట్‌లో 16 టీంలు, వాలీబాల్ 15 జట్లు, ఫుట్‌బాల్‌లో 6జట్లు పాల్గొంటున్నాయి. మొదటిరోజు క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్‌లో శుక్రవారం సెమీఫైనల్స్, ఫైనల్స్ నిర్వహించనున్నారు. పీడీ రాంకళ్యాణ్, పరశురాం, పీఈటీలు కృష్ణ, మోయిన్, జగన్‌మోహన్, రామకృష్ణ, విజయ్ పోటీలను పర్యవేక్షిస్తున్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

జడ్చర్ల: స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం విద్యార్థులకు వార్డు కౌన్సిలర్ శ్రావణి ఆధ్వర్యంలో పరీక్షలు రాసేందుకు వీలుగా ప్యాడ్‌లు పంపిణీ చేశారు. అదేవిధంగా వార్డు కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి నేలల పునరుద్ధరణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ

జడ్చర్ల టౌన్: చిత్తడి నేలల పునరుద్ధరణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.అప్పియాచిన్నమ్మ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ చిత్తడి నేలల పునరుద్ధరణ దినోత్సవం పురస్కరించుకుని వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిత్తడి నేలలోని జీవ సంపద గురించి వివరించారు. ఇప్పటి వరకు 35శాతం చిత్తడి నేలలు నశించిపోయాయని, భవిష్యత్‌లో ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కృషి చేద్దామన్నారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగ అధిపతి శ్రీనివాసరావు, బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించండి



పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

దేవరకద్ర: తమ సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎటు ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో 25వేల మంది ఆశావర్కర్లు సేవలు అందిస్తున్నారని, వారికి సరైన వేతనం ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు. కనీసం వేతనం రూ.26వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు.

అక్రమ కేసులను నిరసిస్తూ బీజేపీ ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

దేవరకద్ర: ప్రజాసామ్యబద్ధంగా నిరసనలు, ధర్నాలు చేస్తున్న వారిపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు వివిధ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసులు, అధికార పార్టీ చర్యలను ఖండిస్తూ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా వెళ్లి పాత గ్రామ పంచాయతీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యలయం వద్ద ధర్నాకు దిగారు. అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని, బీజేపీ ఖండిస్తుందని తెలిపారు. ధర్నా అనంతరం రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా నాయకుడు యజ్ఞభూపాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు అంజన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

తెగులు నివారణకు జాగ్రత్తలు



మాట్లాడుతున్న ఏడీఏ అంజనేయులు

రాజాపూర్: రైతులు వరి పంటలో కాండం తొలిచే పరుగు, అగ్గితెగులు, సుడిదోమ పంటను ఆశించి నష్టపరుస్తున్నదని జడ్చర్ల వ్యవసాయశాఖ ఏడీఏ అంజనేయులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు కుచ్చర్‌కల్ గ్రామంలో వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటలను ఆశిస్తున్న చీడపడలను గుర్తించారు. ప్రస్తుతం కాండం తొలుచు పురుగు ఉధృతి అధికంగా ఉంటుందని, కాండం తొలిచేపురుగు పంటను ఆశించడం వల్ల వెన్నులు తాలుగా ఏర్పడి తెల్లకంకులు వస్తాయన్నారు. నివారణకు అంకురం నుంచి చిరుపొట్టదశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50శాతం, ఎస్‌పీ 400 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 60 మిల్లీలీటర్ల మందు ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి నరెందర్, ఏఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



పాలమూరు: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.రవిని గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అలాగే సూర్యపేట కలెక్టర్‌గా బదిలీ అయిన వెంకట్రావ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాకుల బాలరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణవర్ధన్ రెడ్డి, సత్యం, రమేష్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు వెంటనే రద్దు చేయాలి



మాట్లాడుతున్న భుజంగరావు

భూత్పూర్: ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులు అని చెబుతూ రాజకీయ పలుకుబడి ఉపయోగించి కొందరిని దొడ్డిదారిన బదిలీలు చేస్తుందని, అక్రమ బదిలీలు వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూటీఎస్ అభ్యర్థి వి.భుజంగరావు ఆరోపించారు. గురువారం మండలంలోని ఉన్నత పాఠశాల, కేజీబీవీలో ఉపాధ్యాయులతో విద్యారంగ సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమచంద్రుడు, ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, సంఘ బాధ్యులు ఆంజనేయులు, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

60వ రోజుకు చేరిన రిలేదీక్ష



దీక్షలో కుర్చున్న గ్రామస్తులు

చిన్నచింతకుంట: మండలంలోని తిర్మలాపూరం గ్రామాన్ని చిన్నచింతకుంటలోనే కొనసాగించాలని గ్రామస్తులు చేపట్టిన రిలే దీక్ష గురువారానికి 60వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రామస్తులు పుట్టఅంజయ్య, వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ చిన్నచింతకుంట మండలానికి కూతవేటు దూరంలో ఉన్న తిర్మలాపూరం గ్రామాన్ని నూతనంగా ఏర్పడిన కౌకుట్ల మండలంలో కలిపి గ్రామస్తులకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. గ్రామాన్ని చిన్నచింతకుంటలోనే కొనసాగించాలని ప్రజాప్రతినిధులు, అధికారులతో పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో మధుసూదన్, మాసమ్మ, చంద్రమ్మ, సరస్వతమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ద్వాదశ జ్యోతిర్లింగాల పడిపూజ



బాలానగర్: మండలంలోని మోతీఘనపూర్‌లో గురువారం ద్వాదశ జ్యోతిర్లింగాల పడిపూజ కార్యక్రమం గురుస్వామి పసులాది హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శివస్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు రమేష్, లాలయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్‌లో..

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో గురువారం ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడిపూజ కార్యక్రమం నిర్వహించారు. గురుస్వాములు నిరంజన్‌రెడ్డి, అంజి, నరేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన మహాపడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పడిపూజకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏక్ నిరంజన్, దస్తయ్య, ఆంజనేయులు, రాములు, రవీందర్, కృష్ణయ్య, రఘు, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

బారికేడ్లు ఏర్పాటు

హన్వాడ: మండలంలోని పెద్దదర్పల్లి గేట్ సమీపంలో తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో పోలీసులు నివారణ చర్యలు చేపట్టారు. ఇటీవలి కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో యువకులు, మహిళలు చనిపోయారు. దీంతో ఎస్‌ఐ రవినాయక్ బారికేడ్లను ఏర్పాటు చేయించారు. అదేవిధంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రెడ్ స్టిక్కర్లు, గో స్లో గుర్తులు ఏర్పాటు చేశారు. వాహనాల వేగాన్ని తగ్గించేలా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల నివారణకు వాహనదారులు భద్రతా ప్రమాణాలు పాటించాలని ఎస్‌ఐ సూచించారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల, కాటవరం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు ఒక్కో గ్రామానికి రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరు కావడంతో నిర్మాణాలకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. సకాలంలో పనులు పూర్తి చేసి నాణ్యతగా నిర్మాణాలను చేపట్టాలని అధికారులకు సూచించారు. కాగా, ప్లాస్టిక్ రహిత ప్రయోగాలు చేసి జిల్లా అవార్డు పొందిన శృతిరెడ్డిని ఎమ్మెల్యే ఆల సత్కరించి అభినందించారు.

వీఆర్‌ఏల గురించి అసెంబ్లీలో ప్రస్తావించండి..

దేవరకద్ర, సీసీకుంట, భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట, కౌకుంట్ల మండలాలకు చెందిన వీఆర్ఏలు అడ్డాకలలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని కలిశారు. సీఎం కేసీఆర్ వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని వీఆర్ఏల సంఘం జిల్లా నాయకులు రాంచంద్రయ్య, మునీర్, యాదగిరిలు ఎమ్మెల్యే ఆలను కోరారు. అనంతరం కందూర్ హైస్కూల్‌లో 33 మంది విద్యార్థులకు తన తండ్రి ఆల రఘుపతిరెడ్డి జ్ఞాపకార్థం స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే అందజేశారు.

ఘనపురం కాల్వ పనుల పరిశీలన..

అడ్డాకుల పెద్ద చెరువుకు సాగునీరు వచ్చే ఘనపురం బ్రాంచ్ కెనాల్ పనులను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని షాపూర్ వద్ద జరుగుతున్న గణపురం బ్రాంచ్ కెనాల్ పనులను పరిశీలించి డీఈలు నరేందర్‌రెడ్డి, సత్యనారాయణలతో మాట్లాడారు. 90శాతం పనులు పూర్తయినందునా మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి అడ్డాకుల పెద్ద చెరువుకు నీళ్లు అందించే విధంగా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు మంజుల, భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ రంగన్నగౌడ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, పొన్నకల్ మహెమూద్, రమేష్‌గౌడ్, ఖాజా ఖోరీ తదితరులు పాల్గొన్నారు.